ఆంధ్రజ్యోతి

andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.3 కనిష్ఠం 23.1



నిజామాబాద్
జిల్లా వార్తలు

శనివారం 27 జూలై 2024



కొనసాగుతున్న రుణాల పంపిణీ



- జిల్లా వ్యాప్తంగా రైతులకు రుణాలు అందజేస్తున్న బ్యాంకర్లు
- మాఫీ అయిన రైతులకూ రుణాల మంజూరు
- జిల్లాలో ఇప్పటి వరకు రూ.250 కోట్లు పంపిణీ

నిజామాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రైతులకు కొత్తగా రుణాల పంపిణీ కొనసాగుతోంది. ఓ వైపు రుణమాఫీ అమలవుతుండగా.. మరో వైపు మాఫీ అయిన రైతులకు కొత్తగా రుణాలను అందజేస్తున్నారు. రైతులకు వానాకాలం సాగు పెట్టుబడి కోసం బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేస్తున్నారు. రైతులు సాగుచేసే పంటల ఆధారంగా రుణాలను అందిస్తున్నారు. ప్రభుత్వం రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తుండగానే మాఫీ చేస్తూనే కొత్త రుణాలను అందిస్తున్నారు. జిల్లాలో నిర్ణయించిన లక్ష్యానికి అనుగుణంగా రుణ పంపిణీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రైతులకు ఎక్కువగా పెట్టుబడికి డబ్బులు అవసరం ఉండటంతో గ్రామాల్లోని అన్ని బ్యాంకుల పరిధిలో కొత్త రుణాలను ఇస్తున్నారు. మరో రెండు నెలలు రుణ పంపిణీకి సమయం ఉండటంతో అలోపే ఎక్కువ మొత్తంలో రైతులకు రుణాలు అందిం చేందుకు బ్యాంకర్లు ప్రయత్నాలు చేస్తున్నారు.

రూ.2,437 కోట్ల రుణాల లక్ష్యం

జిల్లాలో వానాకాలం పంటల రుణాలను అందించేందుకు బ్యాంకర్ల కమిటీ సమావేశంలో నిర్ణయించింది. జూన్ నుంచి సెప్టెంబర్‌లోపు రైతులకు అవసరమైన రుణ పంపిణీ చేయాలని లక్ష్యాలను నిర్ణయించింది. బ్యాంకుల వారీగా అన్ని గ్రామాల పరిధిలో ఈ రుణాలను మంజూరు చేస్తున్నారు. జిల్లాలో ఈ వానాకాలంలో 2,437 కోట్ల రూపాయలను పంటలకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లాలో మొత్తం 2లక్షల 46,540 మంది రైతులు గత సంవత్సరం రుణం తీసుకున్నారు. ప్రస్తుతం ఆ రైతులతో పాటు కొత్తగా పట్టాలు పొందిన రైతులకు కూడా రుణాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. గడిచిన నెల రోజులుగా ఈ రుణపంపిణీ కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 250 కోట్ల వరకు రుణ పంపిణీ చేసినట్లు అధికారుల సమాచారం బట్టి తెలుస్తోంది. జిల్లాలోని రైతులు వానాకాలం పంటలను జూన్ ఆరంభం నుంచే మొదలు పెట్టి ఆగస్టు మొదటి వారంలో పూర్తి చేస్తారు. పొలాలు దున్నడానికి, నాట్లు వేయడానికి, విత్తనాలు కొనడానికి, ఎరువులకు పురుగుల మందులకు ఎక్కువగా డబ్బులను వెచ్చిస్తున్నారు. పంటలు సాగు చేసే సమయంలోనే సగానికి పైగా పెట్టుబడి అవసరం ఉండటం, ట్రాక్టర్లు, కూలీలకు వెంట వెంటనే డబ్బులు చెల్లించాల్సి ఉండటంతో ఎక్కువ మొత్తంలో రుణాలను తీసుకుంటున్నారు.

వరిసాగు అధికం

జిల్లాలో సాగయ్యే మొత్తం పంటలో వరి 75 శాతానికి పైగా ఉండటంతో ఆ పంట ఆధారంగా రైతులకు రుణాలను అందిస్తున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరాకు 40 నుంచి 45 వేల వరకు రుణాలను ఇస్తున్నారు. ఇవేకాకుండా పసుపు, మొక్కజొన్న, సోయా, చెరకుతో పాటు ఇతర పంటలు కూడా సాగు చేస్తున్నందున వాటికి కూడా రుణాలను అందిస్తున్నారు. వీటితో పా టు ఉద్యానవన పంటలకు కూడా రుణ పంపిణీ చేస్తున్నారు. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు కూడా బ్యాంకుల నుంచి రుణాలను పంపిణీ చేస్తున్నారు. ఈ నెలతో పాటు ఆగస్టు లోపల నిర్ణయించిన లక్ష్యంలో 75శాతానికి పైగా రైతులకు రుణాలు ఇచ్చే విధంగా బ్యాంకర్లు ఏర్పాట్లు చేశారు. రుణాల పంపిణీపై కలెక్టర్ సైతం ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ రుణ పంపిణీ చేసే విధంగా చూస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వరంగ బ్యాంకులతో పాటు ప్రాంతీయ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, కోఆపరేటివ్ బ్యాంకుల నుంచి రుణాలను పంపిణీ చేస్తున్నారు.

44,465 మంది రైతుల ఖాతాల్లో రూ.225.65 కోట్లు జమ

రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల లోపు ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేపట్టింది. వారి ఖాతాల్లో డబ్బులను జమ చేసింది. జిల్లాలో లక్షలోపు రుణాలు ఉన్న 44,465 మంది రైతుల ఖాతాల్లో 225.65 కోట్ల రూపాయలను జమ చేసింది. వీరే కాకుండా ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోని బ్యాంకుల్లో ఉన్న రైతులకు కూడా రుణ మాఫీ వర్తింపజేసింది. సుమారు 26వేల మంది రైతుల ఖాతాల్లో 75కోట్ల రూపాయలను జమ చేసింది. రైతుల ఖాతాల్లో రుణమాఫీ పడటం వల్ల వారందరికి బ్యాంకు అధికారులు కొత్త రుణాలను మంజూరు చేస్తున్నారు. జిల్లాలో రైతులు వానాకాలం సాగుకు ఇబ్బందులు ఎదురు కాకుండా ఉండేందుకు అన్ని బ్యాంకుల పరిధిలో పెట్టుబడి కోసం కొత్త రుణాలను అందిస్తున్నామని జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్ తెలిపారు. వానాకాలంలో నిర్ణయించిన లక్ష్యానికి అనుగుణంగా సెప్టెంబర్‌లోపు రైతులందరికి రుణాలు అందిస్తామని ఆయన తెలిపారు. పెట్టుబడి అవసరమైన రైతులందరు సంబంధిత బ్యాంకులకు వెళ్లి రుణాలను తీసుకోవాలని ఆయన తెలిపారు. రుణమాఫీ అయిన వారికి కూడా కొత్త రుణాలను ఇస్తున్నట్లు ఆయన వివరించారు.



మోడల్ పాఠశాలలో మొక్క నాటుతున్న కలెక్టర్

అమ్మ ఆదర్శ పాఠశాలలపై అలసత్వం వద్దు

- ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దే బాధ్యత అధికారులదే
- త్వరితగతిన పనులు పూర్తి చేసి నివేదిక అందజేయాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

రెంజల్, జూలై 26: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులలో అలసత్వం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. శుక్రవారం మండలంలోని దండిగుట్ట, వీరన్నగుట్ట, రెంజల్ తెలంగాణ మోడల్ పాఠశాలలోని పనులను ఆయన పరిశీలించారు. వీరన్నగుట్ట గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పెండింగ్‌లో ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి పనులు చేపడుతోందని, పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో అధికారులను హెచ్చరించారు. వీరన్నగుట్ట పాఠశాల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుందని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పనులను పూర్తి చేసి నివేదిక అందజేయాలన్నారు. మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచాలని, రెండు రోజుల్లో ప్రతి పాఠశాలను సందర్శించి నివేదిక అందజేయాలని ఎంపీవో, ఎంపీడీవోను ఆదేశించారు. అనంతరం రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. రెంజల్ ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న స్కూల్ భవనాన్ని కూల్చివేయాలని పంచాయతీ రాజ్ డీఈ రాజయ్యకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల తీరును పరిశీలించి లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణ మోడల్ పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు తమవంతుగా మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్, జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేక అధికారి వాజీద్ హుస్సేన్, తహసీల్దార్ దాసరి శ్రావణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎంఈవో గణేష్ రావు, ఐకేపీ ఏపీఎం చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం, తదితరులు పాల్గొన్నారు.



వీరన్నగుట్టలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

నిండుకుండలా త్రివేణి సంగమం



రెంజల్, జూలై 26: మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమంలో గోదావరి వరద చేరడంతో త్రివేణి సంగమ క్షేత్రం నిండు కుండలా దర్శనమిస్తోంది. మూడు రోజుల నుంచి మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో బాబ్లీ, విష్ణుపురి గేట్లను ఎత్తివేశారు. దీంతో మండంలోని కందకుర్తి గోదావరికి భారీగా వరద వచ్చి చేరడంతో త్రివేణి సంగమం జలకళను సంతరించుకుంది. ప్రస్తుతం గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.



ఊరపండుగ దేవుళ్ల తయారీ



నిజామాబాద్ అర్బన్, జూలై 26: ఊరపండుగను పురస్కరించుకొని నగరంలో సర్వసమాజ్ ఆధ్వర్యంలో దేవుళ్లను తయారీ చేస్తున్నారు. నిపుణులైన వడ్రంగీలు ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా దేవుని ప్రతిమలను తయారు చేసే పనిలో పడ్డారు. అన్ని కులాలు ఐక్యంగా జరుపుకొనే ఊర పండుగ కోసం నగరంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 28న ఆదివారం ఊరపండుగను నిర్వహించనున్నారు. ఖిల్లా శారదాంబ గద్దె నుంచి ఊర పండుగ మొదలు కానుంది. 14 గ్రామ దేవత గుళ్లలో ప్రతీ సంవత్సరం ఎప్పటికప్పుడు మామిడి కర్రతో తయారు చేసే కొత్త విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. నగరంలోని నాకాశ్ గల్లిలో విగ్రహాలను తయారు చేస్తారు.



● బోధన్‌లో కురుస్తున్న వర్షం

వీడని వాన

- జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షం
- పెరుగుతున్న పంటల సాగు విస్తీర్ణం
- వరిసాగుతో పెరిగిన విద్యుత్ వినియోగం
- శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

నిజామాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు 15.7 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో 10 మిల్లీమీటర్ల కంటే ఎక్కువగానే వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా బాల్కొండ మండలంలో 25.9 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలో సరాసరి సగటు వర్షపాతం కంటే 107 మిల్లీమీటర్ల వర్షం ఎక్కువగానే పడింది. జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు 387.5 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 494.8 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో 21 మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం కంటే అత్యధికంగా వర్షం పడింది. జిల్లాలోని 12 మండలాల్లో సగటు వర్షపాతం నమోదైంది. గత సంవత్సరంతో పోలిస్తే 14 మిల్లీమీటర్ల వర్షం జిల్లాలో తక్కువగా పడింది.

జోరుగా వరిసాగు

జిల్లాలో చెరువులు, వాగుల్లో వరద ఉధృతి పెరగడంతో పంటల సాగును కొనసాగిస్తున్నారు. జోరుగా వరిసాగు చేస్తున్నారు. వర్షాలు మరికొన్ని రోజుల పాటు పడనుండటంతో చెరువులు నిండితే తమకు రెండో పంటకు కూడా ఢోకా ఉండదని రైతులు భావిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 3లక్షల ఎకరాలకు పైగా వరిసాగును చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు మొత్తం 4 లక్షల 20వేల ఎకరాలకు పైగా సాగు అవుతుందని అంచనా వేశారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో ఈ వర్షాలు పడుతుండటంతో ఈ నెలాఖరులోపు ఎక్కువ మొత్తంలో విస్తీర్ణం పెరుగుతుందని అంచనాకు వస్తున్నారు.

వ్యవసాయానికి పెరిగిన విద్యుత్ వినియోగం

జిల్లాలో వ్యవసాయ సాగుకు విద్యుత్ వినియోగం పెరిగింది. చెరువులు, కాలువలు పారడం లేని చోట రైతులు ఎక్కువగా మోటార్లపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. వరి ఎక్కువగా సాగు చేస్తున్నారు. వర్షాలకు భూగర్భ జలాలు పెరగడం వల్ల మోటార్ల ఆధారంగా ఈ వరిసాగును ఎక్కువ మంది రైతులు కొనసాగిస్తున్నారు. జిల్లాలో లక్షా 75వేల బోర్ల కనెక్షన్స్ ఉండగా ప్రస్తుతం 90 శాతంకు పైగా రైతులు ఎక్కువ మొత్తంలో విద్యుత్ వినియోగిస్తున్నారు. సగటున రోజుకు జిల్లాలో 8 మిలియన్ల యూనిట్ల వరకు విద్యుత్ వినియోగం అవుతుండగా దీనిలో వ్యవసాయానికి 3.5 మిలియన్ యూనిట్లు వినియోగిస్తున్నారు. వర్షాలు పడుతుండటం వల్ల కొంతమేర తగ్గుతుందని ఎన్‌పీడీసీఎల్ అధికారులు తెలిపారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరుగుతున్న వరద

మహారాష్ట్రతో పాటు ఎగువ ప్రాంతాల్లో పడుతున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు క్రమేపి వరద పెరుగుతోంది. ప్రతీరోజు రెండు నుంచి మూడు టీఎంసీల వరద వచ్చి చేరుతోంది. కందకుర్తి వద్ద మూడు నదుల వరద రావడంతో క్రమేపి నీటిమట్టం పెరుగుతోంది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 25,150 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1072.8 అడుగుల నీళ్లు చేరాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి కెపాసిటీ 80.5 టీఎంసీలకు గాను 28.389 టీఎంసీలకు నీళ్లు చేరాయి.



ప్రాజెక్టు వద్ద పూజలు చేస్తున్న అధికారులు

ఆధునిక దేవాలయాలు జలాశయాలు

● ఎస్సారెస్పీపై అధికారుల సంబురాలు

మెండోర, జూలై 26: నీటి పారుదల జలాశయాలు ఆధునిక దేవాలయాలు అన్న నాటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ మాటలను ఎస్సారెస్పీ అధికారులు గుర్తు చేసుకున్నారు. 1963 జులై 26వ తేదీన ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 61ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎస్ఈ శ్రీనివాస్‌రావుగుప్తా, ఈఈ చక్రపాణి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రాజెక్టుపై సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రాజెక్టు రిజర్వాయర్‌లో పూలు చల్లి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఈ లాల్‌సింగ్, డీఈఈలు గణేష్, సుకుమార్, రఘుపతి, ఏఈఈ వంశీ పాల్గొన్నారు.

జిల్లాలో పలువురు తహసీల్దార్ల బదిలీలు

నిజామాబాద్ అర్బన్, జూలై 26: జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల జిల్లాకు మల్టీజోన్-1 కింద కేటాయించబడిన తహసీల్దార్లకు పోస్టిం గ్ ఇవ్వడంతో పాటు పలువురిని బదిలీ చేస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. బోధన్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కె.గంగాధర్‌ను కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. రెంజల్ తహసీల్దార్ ఎంఎ ఖలీమ్‌ను బోధన్ ఆర్‌డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. జిల్లాకు కేటాయించబడిన టి.పద్మజను నిజామాబాద్ ఆర్‌డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్‌గా నియమించారు. ఏర్గట్ల తహసీల్దార్ ఎండీ యూసుఫ్‌ను ఆర్మూర్ ఆర్‌డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. మెండోరా తహసీల్దార్‌ను బి.సంతోష్‌ను వేల్పూర్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. బోధన్ తహసీల్దార్‌గా ఇటీవల జిల్లాకు కేటాయించబడిన పి.విఠల్‌ను నియమించారు. భీంగల్ తహసీల్దార్ కె.సరితను ఏర్గట్లకు బదిలీ చేశారు. జిల్లాకు ఇటీవల కేటాయించబడిన సి.సంతోష్‌రెడ్డిని మెండోరా తహసీల్దార్‌గా నియమించారు. బాల్కొండ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఏ.శ్రీధర్‌ను భీంగల్ తహసీల్దార్‌గా నియమించారు.



ఘనంగా బోనాల పండుగ

నిజామాబాద్ అర్బన్, జూలై 26: నగరంలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి వేషధారణలో చిన్నారులు అలరించగా.. బోనాలు ఎత్తుకొని మహిళలు సందడి చేసింది. ఈ సందర్భంగా చిన్నారులు ఆటపాటలతో ఊరేగింపుగా బోనాలను తీసుకెళ్లారు. పోతరాజుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు.








సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

ఆర్మూర్‌రూరల్, జులై 26: ఆలూర్ మండల కేంద్రంలో దేగాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యసిబ్బంది సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది ఇంటింటికి తిరుగుతూ నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులు సోకుతాయని వివరించారు. వంట పాత్రలు, ప్లాస్టిక డబ్బాలు, కొబ్బరి చిప్పలు, టైర్లలో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. ప్రతీఒక్కరు ఇంటిలోని చెత్తను పంచాయతీ ట్రాక్టర్‌లో వేయాలని, వీధుల్లో పరవేయవద్దన్నారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకుంటే సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు డాక్టర్ దినేష్, డాక్టర్ మైత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజలింగం, వైద్య సిబ్బంది జెస్సీ, యమున ప్రసన్న, ఆశవర్కర్‌లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.







28న బ్యాడ్మింటన్ అండర్-11,13 బాలబాలికల ఎంపికలు

సుభాష్‌నగర్, జూలై 26: బాడ్మింటన్ ఎంపికలను ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి వాసు, కిరణ్‌కుమార్‌లు తెలిపారు. మోపాల్ మండలంలోని ఫిట్‌నెస్ బ్యాడ్మింటన్ అకాడమిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-11, 13 బాల బాలికల విభాగంలో సింగిల్, డబుల్స్ విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఆధార్ తెచ్చుకోవాలని ఉదయం10గంటల వరకు మైదానానికి చేరుకోవాలన్నారు.

కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న జవాన్‌కు సన్మానం

బోధన్‌రూరల్, జూలై 26: పట్టణంలోని విజయసాయి ఉన్నత పాఠశాలలో కార్గిల్ విజయోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ యుద్ధంలో పాల్గొన్న వీర జవాన్ చంద్రశేఖర్ మోత్కురిని శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సంరక్షణలో సైనికులు తమ విధులను ఏ విధంగా నిర్వర్తిస్తారో వివరించారు. విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో మృతి చెందిన వీర జవాన్‌లకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విజయసాయి హైస్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ వీర జవాన్ చంద్రశేఖర్ మోత్కురి అనేక సంవత్సరాలుగా ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహించారని గుర్తు చేశారు. 1994లో ఆర్మీలో చేరిన చంద్రశేఖర్ 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో పాల్గొని తనదైన శైలిలో శత్రువులతో పోరాడారన్నారు. 2011సంవత్సరంలో పదవీ విరమణ అనంతరం డీఎస్సీ రాసి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా నియామకం అయ్యారన్నారు. ఇలాంటి వీరజవాన్‌ను సన్మానించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఆర్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శుక్రవారం సిల్వర్ జూబ్లీ కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. కార్గిల్ యుద్ధం లో పాకిస్థాన్‌పై విజయం సాధించి తిరిగి మా భూబాగాన్ని స్వాధీన పర్చుకొని విజయం సాధించిన జవాన్‌లకు జేజేలు పలకడం జరిగిందని, అందులో భాగంగా అమర్‌జవాన్‌లకు నివాళులు అర్పించి మాజీసైనికులైన థామస్, అశోక్‌లను శాలువ, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, కార్యదర్శి మేక శ్రీకాంత్, ప్రాజెక్టు చైర్మన్ అంబాల్ల తిరుపతి, కళాశాల ప్రిన్సిపాల్ కనక మహాలక్ష్మీ, లెక్చరర్‌లు దేవరాం, గంగాధర్, లయన్స్‌క్లబ్ సభ్యులు చెన్న రవికుమార్, ద్యాగ ఉదయ్, శశిధర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

నిజామాబాద్ లీగల్: జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సరస్వతీ చౌరస్తా వద్ద కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. 1999 జూలై 26న కార్గిల్ వర్సెస్ పాకిస్తాన్ యుద్ధంలో సైన్యాన్ని తరిమి కొట్టిన భారత సైన్యం విజయకేతనం ఎగరవేసి నేటితో 25 సంవత్సరాలు గడుస్తుందని అన్నారు. కార్గిల్‌లో జరిగిన యుద్ధంలో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన అమరవీరులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రాజ్‌కుమార్ సుబేదార్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ మండలంలో..

మోపాల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు జాతీయ జెండాను చేతపట్టుకొని జై భారత్ అంటూ నినాదాలు చేశారు. దేశం కోసం పోరాడి అమరులైన సైనికులను స్మరించుకున్నారు. యువత వారి అడుగుజాడల్లో నడుచుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సిరిపూర్‌లో బారేడు పోచమ్మ పండుగ

మద్నూర్, జూలై 26 : డోంగ్లి మండలంలోని సిరిపూర్ గ్రామంలో భక్తి శ్రద్ధలతో బారేడు పోచమ్మ పండుగను గ్రామస్తులు సామూహికంగా జరుపుకున్నారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి మహిళలు ఆలయానికి తరలివచ్చి బోనాలను సమర్పించారు. ప్రతి ఏడాది ఆషాడ మాసంలో బారేడు పోచమ్మ పండుగ జరుపుకోవడం అనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా గ్రామస్తులందరూ కలిసి సామూహికంగా పండుగను భక్తి శ్రద్ధలతో కన్నుల పండుగగా జరుపుకున్నారు. అమ్మవారికి సమర్పించే బోనంలో అన్నం పసుపు వండిన పదార్థాలు ఉంచి దానిని ప్రసాదంగా స్వీకరించారు. బోనం కుండకు పసుపు రాసి కుంకుమ బొట్టు పెట్టి వేపాకులను మాలలుగా చుట్టి తయారు చేసిన బోనాలు చూడటానికి ఎంతో ఆకర్షణగా కనిపించాయి.

'చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి'

బిచ్కుంద, జూలై 26: గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30న నిర్వహించే ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గంలో గ్రామపంచాయతీ సిబ్బంది తరలిరావాలని సీఐటీయూ జిల్లా సభ్యుడు సురేష్‌గోండ పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ కార్మికులందర్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీసవేతనం రూ.18 వేలు ఇవ్వాలని కార్మికులందరికి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని, మల్టిపర్పస్ విధానం రద్దు చేయాలని అన్నారు. బకాయిపడిన వేతనాలు చెల్లిస్తూ ప్రతినెల 2న వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

ముప్కాల్, జూలై 26: ముప్కాల్ మండలం నాగంపేట్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించి పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులు రాజేందర్, గంగాధర్, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ఆనంద్, సరితలను శుక్రవారం కాంప్లెక్స్ హెచ్‌ఎం గంగాధర్ శాలువ, మెమోంటోలతో సన్మానించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ కెఎం.రెడ్డి, రెంజర్ల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, నాగంపేట్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, ప్రసాద్, నరేందర్, నవీన్, పంచాయతీ కార్యదర్శి గౌతమి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షుడు

నాసిరకం రోడ్లతో ప్రజలకు ఇబ్బందులు

● రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి
● టీడీపీ నిజామాబాద్ పార్లమెంటరీ అధ్యక్షుడు యాదాగౌడ్

సుభాష్‌నగర్, జూలై26: వారంరోజుల నుంచి కురిసిన వర్షాలకు నాసిరకం రోడ్లు గుంతలు తేలి ప్రజలకు ఇబ్బందికరంగా మారాయని, ప్రభుత్వం వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని టీడీపీ నిజామాబాద్ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంట్రాక్టర్లు డబ్బుల కోసం నాసిరకంగా రోడ్లు వేయడం వల్ల గుంతలు తేలాయని అన్నారు. అధికారులు దీనిపై స్పందించి రోడ్లను బాగు చేయాలన్నారు. వాతావరణంలో మార్పుల దృశ్యావ్యాధులు పెరుగుతున్నాయని, ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. బడ్జెట్‌లో షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామనడం సంతోషకరమని, ఆగస్టు 15లోపు 2లక్షల రుణమాఫీ చేయాలని అన్నారు. మాధవనగర్ రైల్వేబ్రిడ్జి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని ఎంపీ అర్వింద్ ప్రత్యేక చొరవ తీసుకొని త్వరగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, జూలై 26: ఆగస్టు 7న అమృత్‌సర్‌లో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్లను శుక్రవారం జిల్లా కేంద్రంలోని కేర్ కళాశాలలో విడుదల చేశారు. మండల్ డే సందర్భంగా ప్రతీ సంవత్సరం ఆగస్టు 7న ఓబీసీ జాతీయ మహాసభలను నిర్వహించనున్నామని, ఇందులో భాగంగా ఈ ఏడాది పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జరిగేఅఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభకు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో బీసీలు తరలివచ్చి విజయవంతం చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరాల సుధాకర్ కోరారు. దేశవ్యాప్తంగా బీసీల కులగణన నిర్వహించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ప్రైవేటు రంగాలలో బీసీలకు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. బీసీలకు రాజ్యాధికారమే ధ్యేయంగా మహాసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆకుల ప్రసాద్, కరిపె రవీందర్, వినోద్‌కుమార్, శంకర్, శ్రీలత, స్వామి, రాజు, నర్సయ్య పాల్గొన్నారు.

రెంజల్ ఎంపీడీవోగా జాదవ్ వెంకటేష్

రెంజల్,జూలై26: రెంజల్ మండల ఎంపీడీవోగా జాదవ్ వెంకటేష్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇదివరకు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్ నుండి శుక్రవారం జాదవ్ వెంకటేష్ పూర్తిస్థాయి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. బోధన్ ఎంపీడీవోగా పని చేసిన వెంకటేష్ బదిలీపై శుక్రవారం రెంజల్ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

దోమకొండలో చెక్కుల పంపిణీ

దోమకొండ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి అధికారులతో కలసి సీఎం ఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చిన 21 చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ సంజయ్‌రావు, బీజేపీ నాయకులు కుంట లక్ష్మారెడ్డి, మద్దూరి భూపాల్‌రెడ్డి, చింతల రాజేష్, గణేష్, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మనోజ్, జగదీశ్, రవి, విఠల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీకి 156 మంది రైతులు దూరం!

● రుణాల వివరాలు ఆన్‌లైన్ చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం ● మాఫీ కోసం ఆందోళకు సిద్ధమవుతామంటున్న రైతులు

సిరికొండ, జూలై26: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో పని చేసే సిబ్బంది నిర్వాకంతో పంట రుణాలు తీసుకున్న రైతులు రుణమాఫీకి దూరమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేస్తుండగా మండలంలోని రెండు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోని 156మంది రైతులు రుణ మాఫికి అర్హత కోల్పోయారు. 2023 డిసెంబర్ 6 వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో స్వల్పకాలిక (పంట) రుణాలను రైతులు తీసుకున్నారు. సహకార సంఘాల్లో పనిచేసే సిబ్బంది వెంటవెంటనే ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో 156మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. సిరికొండ సహకార సంఘం నుంచి రుణమాఫీ కోసం 578 మంది రైతుల జాబితాను, తూంపల్లి సహకార సంఘానికి చెందిన 605 మంది రైతుల జాబితాను ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం రుణమాఫీ కోసం ప్రభుత్వం 2023 డిసెంబర్ 9ను కట్ ఆఫ్ డేట్‌ను ప్రకటించడంతో 156 మంది రైతులు రుణమాఫీ కాదేమో అని కలత చెందుతున్నారు. డిసెంబర్ 15 తర్వాత ఆన్‌లైన్ ఎంట్రీ చేయడమే వారికి శాపంగా మారింది. సిరికొండ సంఘానికి చెందిన 132 మంది రైతులు 86 లక్షల 46వేలపై చిలుకు రుణాలు మాఫీ కాకుండా మిగిలి పోతాయేమని ఆందోళన చెందుతున్నారు. తూంపల్లి సహకార సంఘానికి చెందిన 24మంది రైతులకు చెందిన 22లక్షల 70వేల రుణాలు మాఫీ అవుతాయ లేదా అని సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో పనిచేసే సిబ్బంది తీవ్ర జాప్యం చేయడమే కాకుండ నిర్లక్ష్యం చేయడమే తమకు శాపంగా మారిందని రైతు రామస్వామి గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. రుణాలు మాఫీ కాకుంటే ఆందోళన చేస్తామని సిబ్బందిని రైతులు హెచ్చరిస్తున్నారు. లక్షా 40 వేలు పంట రుణం తీసుకోగా సహకార సంఘ సిబ్బంది చేసిన పొరపాటుకు తనకు రుణమాఫీకి దూరమయ్యానని బాడాల సంతోష్ ఆవేదన వ్యక్తంచేశారు. రుణమాఫీ కోసం రైతులందరి జాబితాను ప్రభుత్వానికి పంపించామని సిరికొండ, తూంపల్లి సహకార సంఘాల క్యాదర్శులు మహ్మద్ అలీ, దేవిలాల్ చెప్తున్నారు. 2023 డిసెంబర్‌లో కొనుగోలు కేంద్రాల పనుల్లో బిజీగా ఉండడంతో ఆన్‌లైన్ చేయడం ఆలస్యమైందని వివరించారు. ఈ రైతుల విషయాన్ని ఎప్పటికప్పుడు సహకార శాఖ ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఇదే విషయం ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి దృష్టికి తీసికెళ్లినట్లు సిరికొండ సహకార సంఘ కార్యదర్శి మహ్మద్ అలీ చెప్పారు.

'మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలి'

పెద్దబజార్, జూలై26: మధ్యాహ్న భోజనానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచకుండా వారికి రావాల్సిన బకాయి బిల్లులు చెల్లించకుండా కార్మికులతో చెలగాటం ఆడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య, తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి అన్నారు. శుక్రవారం నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారని అన్నారు. గత నాలుగు నెలలుగా ఆందోళనలు చేస్తున్నా నేటికీ కోడిగుడ్ల 8, 9 తరగతుల బిల్లులు చెల్లించలేదని, రూ.10వేల వేతనంపై స్పష్టత ఇవ్వడం లేదని అన్నారు. కార్మికులకు ఇన్సూరెన్స్, యూనిఫాం, పీఎఫ్, ఈఎస్సై సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేశారు. 31న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో నర్సింలు పాల్గొన్నారు.

వర్సిటీలో బాలికల హాస్టల్, ఇంజనీరింగ్ కళాశాల నిర్మించాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి,జూలై 26: రాష్ట్రంలో యూనివర్సిటీలకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.500 కోట్లు కేటాయించడాన్ని పీడీఎస్‌యూ వ్యతిరేకిస్తోందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్ స్పష్టం చేశారు. టీయూలో ఇంజనీరింగ్, బాలికల హాస్టల్, స్టేడియం నిర్మించాలని, వర్సిటీకి రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయించి రెగ్యూలర్ వీసీని నియామించాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రం రిజిస్ట్రార్ యాదగిరికి పీడీఎస్‌యూ నాయకులు అందజేశారు.

కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి

బోధన్‌రూరల్, జూలై 26: సాలూర మండలంలోని తగ్గెల్లి గ్రామంలో కుక్కలు కృష్ణ జింకను వేటాడి చంపాయి. శుక్రవారం తెల్లవారుజామున తగ్గెల్లి గ్రామ పరిసరాలలో జి ంక మృతి చెంది పడి ఉండడం చూసి గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. అనంతరం ఎస్సై నాగనాథ్, అటవీశాఖ అధికారి చంద్రప్రకాష్ ఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన జింకను పరిశీలించారు. కుక్కలు చిన్న పిల్లల ప్రాణాలు, అడవి జంతువుల ప్రాణాలు తీస్తున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడ్డారు. మృతిచెందిన జింకను అటవీశాఖ అధికారులు పోస్టుమార్టం నిమిత్తం వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజు

బోధన్ రూరల్, జూలై 26: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజు అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వోగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన రాజు రాకాసిపేట్, భీమునిగుట్ట ప్రభుత్వ హాస్టల్‌ను సందర్శించి అక్కడ పరిసరాల పరిశుభ్రత గురించి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సీజనల్ వ్యాధుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శివాలయం పరిసరాలతో పాటు పలు కాలనీలో పర్యటించారు. ఆయన వెంట సూపర్‌వైజర్‌లు డాక్టర్ నిర్మల పాల్గొన్నారు.


వార్డుల్లో పర్యటిస్తున్న దృశ్యం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్

ఎంతోమంది ప్రాణత్యాగ ఫలమే కార్గిల్ యుద్ధవిజయం: బోధన్ ఆర్డీవో

బోధన్‌రూరల్, జూలై26: ఎంతోమంది ప్రాణత్యాగ ఫలమే కార్గిల్ యుద్ధ విజయమని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కేంద్రసమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయదివస్ రజతోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం ఎంతోమంది జవాన్లు ప్రాణాలు త్యాగం చేసి దేశానికి కార్గిల్ యుద్ధవిజయాన్ని అందించారన్నారు. 1999లో పాకిస్థాన్ సైనికులు, ఉగ్రవాదులు భారత భూభాగాన్ని అక్రమించుకోవాలని పాక్ చేసిన ప్రయత్నాన్ని ఆపరేషన్ విజయ్‌తో కార్గిల్ నుంచి పాక్ సైనికులను తరిమికొట్టారన్నారు. ప్రతీఒక్కరు వీరులను స్మరించుకోవాలన్నారు. యువతలో చిన్నతనం నుంచి దేశభక్తి పెంపొందించుకోవాలన్నారు.

● భారతీయ సైనికుల పోరాటం అసామాన్యం: ఏసీపీ

భారతీయ సైనికుల పరాక్రమం ప్రేరణదాయకం వారి త్యాగం నిత్యం స్మరణీయమని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. దేశ సరిహద్దుల్లో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ దేశప్రజలకు రక్షణగా నిలుస్తున్న మన దేశసైనికుల పోరాటం అసామాన్యమని అన్నారు. కార్గిల్ యుద్ధంలో విరోచితంగా పోరాడి వీరమరణం పొందిన అమర జవాన్లకు ప్రతి ఒక్కరు స్మరించుకోవాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో మృతిచెందిన వీరజవాన్ గంగాప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి తల్లిదండ్రులను సన్మానించారు. రజతోత్సవ వేడుకల్లో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, దేశభక్తి గేయాల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. బోధన్ డిగ్రీ కళాశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మ నాయక్, బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సురేష్, జిల్లా మహిళ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్‌కే.రసూల్‌బీ, సీడీపీవో జానకి, తదితరులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

● ఒకరి మృతి, మరొరికి తీవ్రగాయాలు


పొదల్లోకి దూసుకెళ్లిన కారు

ఆర్మూర్‌టౌన్, జూలై26: పట్టణంలోని 63వ జాతీయరహదారి దోబీఘాట్ సమీపంలో వేగంగా వచ్చిన కారు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం కడెం ఖానాపూర్ మండలం బదంకూర్తి గ్రామానికి చెందిన మంత్ర రాజ్యంనరేష్, పొరెపల్లి నగేష్ బైకుపై వస్తున్నారు. ఈక్రమంలో నిజామాబాద్ నుంచి ఆర్మూర్‌వైపు వేగంగా వస్తున్న కారు అదే రూట్‌లో బైక్‌పై వస్తున్న నరేష్, నగేష్‌లను ఢీకొట్టి కొద్దిదూరంపాటు ఈ డ్చుకెళ్లి పొదల్లోకి వెళ్లి ఆగింది. కారు హెయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో కారులో ఉన్న వారికి ప్రమాదం సంభవించలేదు. ప్రమాదంలో గాయాలైన ఇద్దరిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గంమధ్యలో నరేష్ (43) మృతిచెందాడని డాక్టర్ రేష్మ తెలిపారు. నగేష్ తలకు, కాళ్లకు గాయాలవడంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని ఎస్సై అశోక్ పరిశీలించారు. మృతుడికి భార్య సునీత, కుమారుడు, కూతురు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే

కామారెడ్డిటౌన్, జూలై 26 : వర్షాలు పడి పంటలు బాగా పండితే రైతులు ఆనందంగా ఉంటారని, వారు ఆనందంగా ఉంటేనే మనందరికీ ఆనందమని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో అన్నికులాలతో సమ్మిళతమైన కామారెడ్డి అభివృద్ధి సదరు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరడమ్మ పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం మొదలైనా వర్షాలు లేకపోవడంతో రైతులు నెలన్నర క్రితం వరకు ఎంతో ఆందోళనకు గురయ్యారని, గ్రామదేవతలకు ఎన్నో పూజలు నిర్వహించి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో దేవత లకు బోనాలు సమర్పించారని అన్నారు. దీంతో దేవతల అనుగ్రహంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులలో ఆనందం వ్యక్తం అవుతుందని, వర్షాలు మరింత పడి చెరువులు, కుంటలు కళకళలాడాలని అన్నారు. ప్రతిఏటా కామారెడ్డి పట్టణంలో ఊరడమ్మ పండుగను ఘనంగా నిర్వ హించడం హర్షించదగిన విషయమని, అమ్మవారి ఆశీస్సులు అందరికి ఉండి ఎలాంటి వ్యాధులు భారినపడకుండా చూసుకోవాలని అమ్మవారిని కోరినట్లు తెలిపా రు. అదే విధంగా సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కామారెడ్డి మండల, పట్టణానికి చెందిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్దిదారుల కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాజంపేట/మాచారెడ్డి/బీబీపేట:కామారెడ్డి నియోజవర్గంలోని రాజంపేట,మాచారెడ్డి, బీబీపేట మండలాల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి చెక్కులను పంపిణీచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో వైద్యఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబానికి అండగా ఉండే ఉద్దేశ్యంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయామండలాల అధికారులుపాల్గొన్నారు.

బాన్సువాడ అభివృద్ధికి కృషి

● మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, జూలై 26 : రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అత్యధికంగా 11 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరైన ఏకైక నియోజకవర్గం బాన్సువాడ అని ఎమ్మెల్యే పోచారం శ్రీని వాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడ నియోజకవర్గంలోని కోటగిరి, బాన్సువాడ పట్టణంలో ఆగ్రోఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి డబుల్ బెడ్‌రూమ్ బిల్లు చెక్కులను పంపిణీ చేశారు. డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన బిల్లులు గత ప్రభుత్వంలో 93 శాతం వచ్చాయని, మరో రూ.20 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రస్తుతం 8 కోట్లు బిల్లులు విడుదల చేయడం జరిగిందన్నారు. బిల్లులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ జంగం గంగాధర్, పోచారం సురేందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

రెంజల్,జూలై26: లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వీడనాడి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులు వినతిపత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు. నెల రోజుల నుంచి నిరసన తెలుపుతున్న కార్మికులకు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తమ ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని లేని యెడల సమ్మెను తీవ్రతరం చేస్తామని కార్మికులు హెచ్చరించారు. చాలిచాలని వేతనాలతో పనులు కొనసాగిస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని, ప్రభుత్వం స్పందించకపోతే లిఫ్ట్ కార్మికులందరు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రూపేష్, విఠల్, ప్రవీణ్, సందీప్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి'

సిరికొండ జులై 26 : తెలంగాణ రాష్ట్ర మాడల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని కోరుతూ మాడల్ స్కూల్ ముందర ఉపద్యాయులు నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మాడల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టక పోవడం బాధకరమని ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు అన్నారు.గత ఏడాది ప్రభుత్వం బదిలీలు చేపట్టగా కొంతమంది ఉపద్యాయులు కోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వం ప్రక్రీయను నిలిపివేసిందని ఉపాధ్యాయులు తెలిపారు. దీంతో ఏదకొండేళ్లుగా మాడల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదీలల కోసం ఎదిరి చూస్తున్నారని బదిలీల ప్రక్రీయ నిలిచిపోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే మాడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

వర్నీ,జూలై26: చందూర్ మండల కేంద్రంలో శుక్రవారం రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభం అయ్యాయి. గుంతలుగా ఏర్పడిన రోడ్డును చదును చేశారు. నెల రోజుల్లో చందూర్ నుంచి జలాల్‌పూర్ వరకు గల బీటీ రోడ్డు పనులు చేపడతామని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చినట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ ప్యారం అశోక్, మాజీ ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, కర్లం సాయిరెడ్డి, రాజిరెడ్డి, జయరాం, కార్యదర్శి పెర్క సాయిలు పాల్గొన్నారు.



మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బందితో సమావేశం

మద్నూర్, జూలై 26 : గ్రామీణ ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వారికి అందుబాటులో ఉండాలని, డోంగ్లి పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఎంపీహెచ్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్న వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలంలో మలేరియా, ఫైలేరియా, హెపటైటీస్ బి తదితర రోగాలు ప్రభలే ప్రమాదం ఉందని, ముందస్తుగా ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధులను గుర్తించిన తగిన చికిత్స అందించాలని అన్నారు. అదే విధంగా ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ దవాఖానాలోనే ప్రసవం జరిగేటట్లు ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు చూడాలని సూచించారు. వయసు పై బడిన వారికి పలు రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. ఆశా వర్కర్లు గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. డోంగ్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వారం వారం నిర్వహించే మహిళా ఆరోగ్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు ఉచితంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రవి, లక్ష్మీ, యాదమ్మ, పీహెచ్‌సీ, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరుగుతూ ఆరోగ్య సర్వే

బీర్కూర్, జూలై 26 : వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం బీర్కూర్ మండలంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరుగుతూ జ్వర సర్వే నిర్వహించారు. ప్రస్తుతం వర్షాకాలంలో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దోమల వల్ల సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. ఈ సమస్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో ఆరోగ్య శాఖ అధికారులు జ్వర సర్వే చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు గ్రామ గ్రామన ఇంటింటికి తిరుగుతూ జ్వరం, జలుబు, దగ్గు, ఒంటి నొప్పులతో బాధపడుతున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పీహెచ్‌సీకి తరలించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు.

రూరల్ ఎంపీవోకు వీడ్కోలు


మధురిమను అభినందిస్తున్న సిబ్బంది

నిజామాబాద్ రూరల్, జూలై 26: రూరల్ మండల ఎంపీవోగా, ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎ.మధురిమకు తోటి ఉద్యోగులు వీడ్కోలు పలికారు. శుక్రవారం రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో ఇక్బాల్ వీడ్కోలు కార్యాక్రమం నిర్వహించారు. ఎంపీవోగా ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసుకుని బదిలీపై మోస్రా మండల ఎంపీవోగా వెళ్తున్న మధురిమతో తోటి ఉద్యోగులు తమ అనుభవాలు పంచుకున్నారు. నిక్కచ్చిగా, నిజాయితీ పనిపట్ల బాధ్యతగా విధులు నిర్వహిస్తూ తోటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించారని పంచాయతీ కార్యదర్శులు తమ అనుభవాలు పంచుకున్నారు, నిజామాబాద్ మండలాన్ని ఈజీఎస్, పన్నుల వసూళ్లలో టాప్ జాబితలో నిలబెట్టారు. మండలంలోని పాల్దా గ్రామానికి జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామంగా ఎన్నికకావడంతో మధురిమ కృషి ఎనలేనిది. మధురిమకు పంచాయతీ కార్యదర్శులు శాలువా కప్పి, మెమొంటోలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఇక్బాల్, సూపరింటెండెంట్ ప్రవీణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, విష్ణు నాయక్, కె.ఉమ, ప్రియాంకరాజ్, నిఖిత, శ్యామల, స్వాతి, సిబ్బంది ప్రశాంత్‌కుమార్, శివ, ఉమాదేవి, పవన్‌కుమార్, లక్ష్మయ్య ఉన్నారు.

కులం పేరుతో దూషించిన ఒకరికి ఏడేళ్ల జైలు శిక్ష

నిజామాబాద్ లీగల్, జూలై 26 : వ్యవసాయ భూమిలో ఉన్న తుంపర పైపులను తగలబెట్టి యజమానిని భూమి అమ్మమని కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఏడుసంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి టి.శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే... 25-5-2020 రోజున ఏర్గట్ల మండలం దాత్రి గ్రామానికి చెందిన కుండ చిన్నసాయిలు తన వ్యవసాయ చేసుకొని జీవించేవాడు. సర్వే నెంబర్ 557/1 ఉన్న వ్యవసాయ భూమిని దౌర్జన్యంగా లాగేసుకోవాలనే ఉద్దేశంతో తన పొలంలో ఉన్న తుంపర పైపులను తగలబెట్టి, భూమి యజమానిని భూమిని అమ్మమని లేకుంటే చంపేస్తానని కులంపేరుతో దూషించిన ముద్దాయి మునిగె చిన్న లింబాద్రి (అలియాస్ కత్తి) బెదిరించడంతో పోలీసు వారు కేసు నమోదు చేసుకొని సాక్ష్యాధారాలతో కోర్టులో హాజరుపర్చగా పోలీసువారి తరఫున పీపీ బంటు వసంత్ వాదించగా సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి ముద్దాయి చేసిన నేరానికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ, 4,700 రూపాయల జరిమానా చెల్లించాలన్నారు. జరిమానా చెల్లించని యెడల ఆరునెలల జైలు శిక్ష విధించాలని తీర్పుచెప్పారు.

కోర్టులో సాక్షి ఫొటోలు తీసిన నిందితుడిపై కేసు

నిజామాబాద్ లీగల్, జూలై 26 : మొదటి అదనపు జిల్లా కోర్టులో ఓ కేసులో సాక్ష్యం చెప్పడానికి వచ్చిన సాక్షిని ఫొటో తీయగా నిందితుడిపై కేసు నమోదైంది. ఈ విషయం న్యాయాధికారికి తెలపడంతో వెంటనే కోర్టు పోలీసులను పిలిపించి మాట్లాడారు. ఒకటోటౌన్‌లో సాక్షి ఫిర్యాదు మేరకు నిందితుడిపై బీఎన్ఎస్ 351, 232 సెక్షన్‌లపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా మొదటి అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ మాట్లాడుతూ కోర్టుకు వచ్చిన సాక్షిని ఎవరైనా ఫోటోలు తీసినా, బెదిరించిన, బ్లాక్‌మెయిల్ చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇద్దరు మట్కారాయుళ్ల అరెస్టు

ఖిల్లా, జూలై 26 : నగరంలోని ఒకటోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మట్కా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఖచ్చితమైన సమాచారం మేరకు సీపీ కల్మేశ్వర్ సింగెనెవార్ ఆదేశాలపై మట్కా ఆడుతున్న అబ్దుల్ అజీజ్, అబ్దుల్ నుశిత్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 6,290 రూపాయల నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి కేసు నమోదు కోసం వీరిని ఒకటోటౌన్ పోలీసులకు అప్పగించారు.

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి : ఎంపీడీవో

రుద్రూరు, జూలై 26 : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా రుద్రూరు మండల సమీకృత కార్యాలయం వద్ద ఆయన మొక్కలను నాటారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. పాఠశాల పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతిఒక్కరూ ఆరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అప్పుడే పచ్చదనం పరిశుభ్రత ఏర్పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీవో మనోహర్, రుద్రూరు పంచాయతీ కార్యదర్శి గంగాధర్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో కొండాపూర్‌లో పీహెచ్‌సీ ఏర్పాటు

రాజంపేట, జూలై 26 : మండలంలోని కొండాపూర్‌లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీహెచ్‌సీ కావాలని గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని కాంగ్రెస్ నాయకులు తెలి పారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా మదన్‌మోహన్ రావు గెలుపొందడంతో ఆయన చొరవ తీసుకుని కొండాపూర్‌లో పీహెచ్‌సీ ఏర్పాటుకు సభదృష్టికి తీసుకెళ్లడం హర్షించదగిన విషయమన్నారు. అదే విధంగా రైతులకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర బడ్జెట్ ప్రారంభించడం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్‌రెడ్డి, జిల్లా ఎస్టీసెల్ వైస్‌ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, మండల ఉపాధ్యక్షులు బస్సీలాల్, శ్రీధర్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కుమార్ కులాచారి

పెద్దబజార్, జూలై 26: రాష్ట్రబడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కుమార్ కులాచారి విమర్శించారు. శుక్రవారం నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తాలో నిరసన చేపట్టి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గురువారం కేటాయించిన రాష్ట్రబడ్జెట్‌లో నిజామాబాద్ జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. బడ్జెట్‌లో నిజాం చక్కెర కర్మాగారానికి ఎంత కేటాయించారని ప్రశ్నించారు. జిల్లా పట్టణాభివృద్ధికి అవసరమైన నిధులు, బోధన్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిది గాడిద గుడ్డా అని ఎద్దేవాచేశారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు అన్యాయం జరిగిందని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు కోటపాటి నర్సింహా నాయుడు, తిరుపతి రెడ్డి, భరత్ భూషన్, రోషన్‌లాల్ బోరా, నారాయణయాదవ్, హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'నిధులు కేటాయించకుండా ఉపాధిని దెబ్బతీయడం సరికాదు'

పెద్దబజార్, జూలై26: ట్రాన్స్‌పోర్టు కార్మికులను ఆదుకునేందుకు నిధులు కేటాయించకుండా ఉపాధిని దెబ్బతీయడం సరైందికాదని ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కటారి రాములు అన్నారు. శుక్రవారం నగరంలోని పూలాంగ్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. ఆటోడ్రైవర్లు, ట్రాన్స్‌కో కార్మికులపై విపరీతమైన జరిమానాలతోపాటు శిక్షలను వేసే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై వ్యక్తంచేశారు. ఇన్సూరెన్స్, లైసెన్సులను, ఫిట్‌నెట్ ప్రభుత్వమే భరించాలని, భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చినట్లుగా ట్రాన్స్‌పోర్టు కార్మికులకు కూడా కార్పొరేషన్ ఏర్పాటుచేయాలన్నారు. మహిళలకు ఫ్రీ బస్సుతో ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిన్నదని, ఆటోడ్రైవర్లకు ఏడాది రూ.12వేలు ఇస్తామని చెప్పిన దానిపై బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. తమ సమస్యలు పరిష్కరించనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్ల నగర అధ్యక్షుడు కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో గుండె వ్యాధులపై ఆరోగ్య శిబిరం

పెద్దబజార్, జూలై26: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చిన్నపిల్లలకు గుండెకు సంబంధించిన వ్యాధులపై ఆరోగ్య శిబిరం నిర్వహించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతిమరాజ్ మాట్లాడుతూ పిల్లలకు గుండెకు సంబంధించిన పరీక్షలు 2డికో నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించినట్లు తెలిపారు. శిబిరానికి 156మంది పిల్లలు రాగా 53 మందికి గుండెకు సంబంధించిన వ్యాధిగ్రస్తులను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం, వైద్యులు అశోక్, అమూల్ గుప్త, అపోలో సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఏసీపీ ఆధ్వర్యంలో వన మహోత్సవం

ఖిల్లా, జూలై 26: వనమహోత్సవంలో భాగంగా ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయం ఆవరణలో ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబుతో కలిసి మొక్కలు నాటారు.

'సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలి'

పెద్దబజార్, జూలై 26: సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. శుక్రవారం నగరంలోని అర్సపల్లిలోగల రైతుకూలీ సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లాభాల బాటలో నడిచిన ఫ్యాక్టరీని గత పాలకుల తప్పుడు విధానాల ఫలితంగా ఫ్యాక్టరీ మూసివేశారని అన్నారు. గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి సింహభాగం కేటాయించామని చెప్తున్నా సారంగపూర్ ఎన్‌సీఎస్‌ఎఫ్ చక్కెర ఫ్యాక్టరీ రైతులు గుర్తుకు రారా అని ఎద్దేవాచేశారు. ఫ్యాక్టరీ తెరిపిస్తుందని గంపెడు ఆశతో ఉన్న ఈప్రాంత రైతులకు నిరాశే మిగిలిందని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాయక్వాడి నర్సయ్య, ఉపాధ్యక్షుడు కృష్ణాగౌడ్, సాయిలు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య రంగానికి కేటాయింపులు తగ్గించడం బాధాకరం'



పెద్దబజార్, జూలై 26: విద్య, వైద్య, ఆరోగ్య, స్త్రీ సంక్షేమ రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించడం బాధాకరమని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు అన్నారు. శుక్రవారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.9,200 కోట్లు కేటాయించడం, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై సభలో మాట్లాడకపోవడం బాధాకరమని అన్నారు. కనీసం 20వేల కోట్లకు పైగా కేటాయించాల్సిన బీసీ బడ్జెట్ కేవలం 9,200 కోట్లు కేటాయించడం బీసీలకు అవమానకరమన్నారు. త్వరలోనే బీసీ నాయకులు, సంఘాలు పెద్దఎత్తున ఉద్యమించక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి పద్మావతి

నిజామాబాద్ అర్బన్, జూలై26: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీనియర్ న్యాయాధికారి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ నవనిర్మాణ విద్యార్థి సేనా ఆధ్వర్యంలో యంగ్‌సైరన్ పేరుతో డ్రగ్ ఫ్రీ తెలంగాణకు మేము సైతం అనే కార్యక్రమాన్ని నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మేదరి శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పద్మావతి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటితో పిల్లల ఆరోగ్యాలు చెడిపోవడమే కాకుండా దేశభవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. మాదకద్రవ్యాలు వాడుతూ పట్టుబడితే వారి విషయంలో కఠినంగా శిక్షలు ఉంటాయని, యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. ఎక్కడైనా డ్రగ్, గంజాయి, మాదకద్రవ్యాలు అమ్ముతున్నా, కొనుగోలు చేసినా వారి సమాచారాన్ని తెలియజేయాలన్నారు. నేటి యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యాంటి డ్రగ్ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో యాంటి నార్కోటిక్ డీఎస్పీ సోమనాథ్, నగర ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ విశాల్, విద్యార్థి సేనా రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్, పిల్లిశ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో భారీగా నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి

ఖిల్లా, జూలై 26: నగరంలోని రైల్వేస్టేషన్‌లో గురువారం అర్ధరాత్రి తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న నాందెడ్‌కు చెందిన ప్రకాష్ రుక్మాజి షిండే అనే వ్యక్తిని తనిఖీ చేయగా అతని బ్యాగులో రూ.55 లక్షలు గుర్తించినట్లు ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. డబ్బుకు సంబంధించిన ఆయన వద్ద ఆధారాలు లేకపోవడంతో డబ్బును స్వాధీనం చేసుకొని 1వ టౌన్ ఎస్‌హెచ్‌వోకు తదుపరి విచారణ నిమిత్తం అప్పగించినట్లు తెలిపారు. మహారాష్ట్ర నుంచి తక్కువ ధరకు బంగారాన్ని జిల్లాకేంద్రంలో అమ్మడానికి తీసుకొచ్చినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. బంగారం అమ్మిన డబ్బును తిరిగి మహారాష్ట్రకు తీసుకెళ్తున్నట్లు గుర్తించామన్నారు. కొంతకాలంగా ఇటువంటి వ్యాపారం జరుగుతున్నట్లు తమ దృష్టికి రావడంతో తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డిచ్‌పల్లి, జూలై26: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు గ్రామాల్లో ప్రబలే ఆస్కారం ఉందని, కార్యదర్శులు ఎప్పటిప్పుడు మురుగు కాల్వల శుభ్రత, క్లోరినేషన్‌పై ప్రత్యేకచర్యలు తీసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ యోహాన్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శుల సమీక్షకు ఎంపీవో రవీందర్‌తో కలిసి ప్రత్యేకాధికారి మాట్లాడారు. తాగునీటి క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి తీసుకోవాలన్నారు. వనమహోత్సవంలో మొక్కలు నాటి విజయవంతం చేయలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, ఈవో కిషన్ రావు, ఏపీవో సుధాకర్ రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

'విద్యారంగానికి 7.03% నిధులు అన్యాయం'

డిచ్‌పల్లి, జూలై 26: రాష్ట్రబడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.03శాతం నిధులు కేటాయించడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. తక్కువ నిధులు కేటాయించడానికి నిరసనగా రాష్ట్రబడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి వర్సిటీల అభివృద్ధికి రూ.500 కోట్లు ఏలా సాధ్యమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి చొరవ చేసుకుని టీయూకి రూ.200కోట్లు తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వర్సిటీ ప్రతినిధులు చిత్రు, మధు, రఘు, శ్రీనువాస్, పాల్గొన్నారు.

విద్యార్థులకు రాజ్యంగ ప్రవేశిక పుస్తకాల పంపిణీ

డిచ్‌పల్లి, జూలై26: భారతరాజ్యంగ ప్రవేశిక పుస్తకాలను ఖిల్లా డిచ్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు శుక్రవారం పంపిణీచేశారు. బాలలకోసం భారత రాజ్యంగ అనే పేరుతో ఉన్న పస్తుకాలను పంపిణీ చేశామని ప్రధానోపాధ్యాయుడు సీతయ్య తెలిపారు.

'పారిశుధ్య కార్మికుల బదిలీలు ఆపాలి'

పెద్దబజార్, జూలై26: నగరపాలక సంస్థలో చేపడుతున్న పారిశుధ్య కార్మికుల బదిలీలు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వైఓమయ్య అన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం ఆవరణలో శుక్రవారం జనరల్ బాడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు పారిశుధ్య విభాగంలో పనిచేయడం వల్ల అనేక చర్మ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, పిడ్స్ లాంటి అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. సీనియారిటీ ప్రకారం కార్మికులకు ప్రమోషన్ ఇవ్వాలని, స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, రెగ్యూలర్‌గా రావాల్సినటువంటి సబ్బులు, చెప్పులు, నూనెలు, యూనిఫాం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు, నాయకులు నర్సయ్య, ఒడ్డెన్న, రజిని, సాయమ్మ, రాజేందర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లలున్నా పోటీకి అర్హత కల్పించాలని మంత్రికి వినతి

ఆర్మూర్‌రూరల్, జూలై26: ఇద్దరి కంటే ఎక్కువమంది పిల్లలు ఉన్న వారి కి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత కల్పించాలని కోరుతూ పలువురు నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇద్దరి కంటే ఎక్కువమంది పిల్లలు ఉన్న వారికి స్థానిక సంస్థల్లో పోటీ చేయడానికి అనర్హత వేసిన 1995 చట్టాన్ని రద్దు చేయాలని, మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యేక జీవో ద్వారా అనుమతించాలని వారు కోరారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తానని మంత్రి హామీఇచ్చినట్టు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో 1995 రద్దు కమిటీ అధ్యక్షుడు అభిమాన్ గాంధీనాయక్, ఇట్టెడి లింగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నవీన్, రాజ్‌కుమార్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ పొందిన రైతులతో అభిప్రాయ సేకరణ



రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్న దృశ్యం

కమ్మర్‌పల్లి, జూలై 26: లక్ష లోపు రైతు రుణమాఫీపై వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం మండలంలోని ఇనియత్ నగర్ రైతులతో అభిప్రాయసేకరణ చేపట్టారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి వాజిద్ హుసేన్ గ్రామంలో రుణమాఫీ పొందిన రైతులతో క్షేత్రస్థాయిలో అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. లక్షలోపు రుణమాఫీకి అర్హులమైనా తమపేర్లు జాబితాలో రాలేదని కొందరురైతులు చెప్పగా పూర్తి వివరాలతో సంబంధిత బ్యాంక్‌లు, గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. అనంతరం అదే గ్రామంలో నిర్వహిస్తున్న పంటల నమోదును కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వాజిద్ హుసేన్ పరిశీలించారు. ఆయనవెంట కమ్మర్‌పల్లి వ్యవసాయాధికారి అబ్దుల్ మలిక్, ఏఈవోలు సాయిరాం, రాజు, గ్రామ రైతులు ఉన్నారు.

ఏర్గట్ల తహసీల్దార్‌గా శ్రీలత

ఏర్గట్ల, జూలై 26: ఏర్గట్ల తహసీల్దార్‌గా శ్రీలత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భీమ్‌గల్ తహసీల్దార్‌గా పనిచేసిన ఆమె బదిలీపై ఏర్గట్లకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ శ్రీలతకు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సదానంద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మోపాల్ ఎంపీడీవోగా రాములు

మోపాల్, జూలై26: మోపాల్ మండల ఎంపీడీవోగా రాములు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న లింగం నాయక్ వేల్పూర్ మండలం సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ముధోల్ నుంచి రాములు మోపాల్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనకు అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

'మహిళాశక్తి రుణాలను అర్హత ఉన్న సంఘాలకే ఇవ్వాలి'

ఏర్గట్ల, జూలై26: మహిళా శక్తి రుణాలు అర్హత గల సంఘాలకే ఇవ్వాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు వసంత తెలిపారు. శుక్రవారం జరిగిన మండల సమాఖ్యలో సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళాశక్తి కార్యక్రమాలు, కొత్త సంఘాల ఏర్పాటు, న్యూఎంటర్‌ప్రైజెస్, టైలరింగ్, పాడి గేదెలు, పెరటి కోళ్ల, మీసేవ, బ్యూటీపార్లర్, స్త్రీనిధి నిర్వహణ పలుఅంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్యామ్, సీసీ సంతోష్, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆగస్టు 4 నుంచి టీటీసీ థియరీ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్, జూలై 26: ప్రభుత్వ పరీక్షల విభాగం హైదరాబాద్ ఆదేశాల మేరకు టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (లోయర్ గ్రేడ్) థియరీ పరీక్షలు ఆగస్టు 4న నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి. దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు బీఎస్ఈ.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచడం జరిగిందని ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

నిషేధిత గుట్కా పట్టివేత

ఖిల్లా, జూలై 26: నగరంలోని 2వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత గుట్కాను టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకున్నారు. హైమదీబజార్‌కు చెందిన ఓ కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు లక్షా 70వేల విలువ నిషేధిత గుట్కాను గుర్తించారు. గుట్కాను స్వాధీనం చేసుకొని కేసు నమోదుకు పోలీసులకు అప్పగించినట్లు ఎస్సై ఎల్.రామ్ తెలిపారు.

స్వప్నరాణికి జీవనసాఫల్య పురస్కారం

నిజామాబాద్‌అర్బన్, జూలై26: శ్రీవిద్యాగణపతి కళాపీఠం నిజామాబాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ఉపన్యాసకురాలు డాక్టర్ స్వప్నరాణికి కళాత్మక సేవలు గుర్తించి శుక్రవారం సుభాష్‌నగర్‌లోని సంగీత నృత్యకళాశాల ప్రాంగణంలో శాలువాతో సన్మానించి జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమెచేసిన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి చందన్‌రావు, ప్రముఖ అష్టావధాని సంస్థనిర్వాహకుడు గణపతి అశోకశర్మ, సముద్రాల రాములు, నర్సింహాచారి, తదితరులున్నారు.

పీఆర్టీయూ అధ్యక్షుడిగా కృష్ణప్రసాద్

ఏర్గట్ల, జూలై26: మండల పీఆర్టీయూ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఉపాధ్యాయుడు కృష్ణప్రసాద్‌ను శుక్రవారం మండలంలోని తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులబృందం సత్కరించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, రాములు, గంగాధర్, ఆనంద్, స్వప్న, విజయ పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● డీఎల్‌పీవో శ్రీనివాస్



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

ధర్పల్లి, జూలై26: పరిసరాల శుభ్రత కోసం నిర్వహిస్తున్న ఫ్రైడే, డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు రామడుగు, దుబ్బాక, మైలారం, చల్లగరిగె గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వైద్యశాఖ చేపట్టిన ఫ్రైడే డ్రైడేపై ప్రజల్లో కార్యదర్శులు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ క్రమం తప్పకుండా చేయాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో గ్రామస్తులను భాగస్వాములను చేయాలని సూచించారు. మురికికాలువల్లో నీరు నిలువకుండా దోమలు వ్యాపించకుండా ఎప్పటికప్పుడు నివారణ మందులను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, మండల వైద్యాధికారి, ఈవో సైఫొద్దీన్, ఏపీఎం సునీత, ఏపీవో వినోద, కార్యదర్శులు, ఉపాధిహామీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు ఆయా గ్రామాల్లోగల పాఠశాలల్లో జరుగుతున్న మధ్యాహ్నభోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఏజెన్సీలకు తగు సూచనలు ఇచ్చారు.

ముప్కాల్‌లో ఫ్రైడే డ్రైడే

ముప్కాల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని ముప్కాల్ ఎంపీవో మహమ్మద్ ముఫ్తపోద్దిన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫ్రైడేడ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులకు కారణమైన దోమల నిర్మూలనకు ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది ఎఎన్ఎం సూకన్య, ఆశాలు, పంచాయతీ కార్యదర్శి, పారిశుధ్య కార్మికులున్నారు.



ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ట్రైనీ అడిషనల్ కలెక్టర్

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

జక్రాన్‌పల్లి, జూలై26: మండలంలోని మునిపల్లిలో శుక్రవారం ఇళ్ల నిర్మాణ పనులను ట్రైనీ అడిషనల్ కలెక్టర్ సంకేత్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ పరిశీలించారు. గ్రామంలో పంచాయతీ అనుమతితో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణపనుల వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇళ్లు నిర్మించుకుంటే మొదట పంచాయతీ అనుమతి సంబంధించిన వివరాలను ట్రైనీ అడిషనల్ కలెక్టర్ సంకేత్‌కుమార్‌కు డీపీవో వివరించారు. ఇంటి పనుల వసూలు గ్రామపంచాయతీ వచ్చే వనరుల గురించి అడిగితెలుసుకున్నారు. అడిషనల్‌ట్రైనీ కలెక్టర్ వెంట ఎంపీడీవో సతీష్‌కుమార్, గ్రామప్రత్యేక అధికారి ఎంపీవో యుసుఫ్‌ఖాన్, ఏపీవో రవి, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

డొంకేశ్వర్, జూలై26: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జీవితం ఆదర్శమని రజక సంఘం సభ్యులు నరేష్, నవీన్, రాజేశ్వర్‌లు అన్నారు. డొంకేశ్వర్ మండలకేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సంఘ సభ్యులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి చాకలి ఐలమ్మ అంటూ కొనియాడారు. ఐలమ్మ ఆశయసాధనకు కృషిచేయాలని కోరారు. నిజంనిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి వెనుకబడిన తరగతులలో సామాజిక చైతన్యం రగిలించిన వీర వనితని, ఐలమ్మ పోరాటం చరిత్రలో నిలిచిందని అన్నారు. చాకలి ఐలమ్మ పోరాటపటిమను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.